మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 134/ 06 బుధవారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-




విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842


# సిఎం రేవంత్




- సిఎల్పి నేతగా రేవంత్ పేరు ఖరారు చేసిన కాంగ్రెస్
- మీడియా సమావేశంలో ప్రకటించిన కెసి వేణుగోపాల్
- ఉదయం నుంచి సిఎం పదవిపై వరుస భేటీలు..చర్చలు
- ఖర్గే, వేణుగోపాల్‌లతోతో డికె శివకుమార్ భేటీ
- కెసి వేణుగోపాల్‌లో ఉత్తమ్, భట్టిల చర్చ
- హైకమాండ్ పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి రేవంత్



# మిచౌంగ్ తుఫాన్ బీభత్సం..!

2 లో



- ఎడతెరిపి లేకుండా వర్షాలు
- కుదేలైన అన్నదాత
- విరిగిపడిన కరెంటు స్తంభాలు
- నేలకొరిగిన కొబ్బరి,అరటి,మునగపంంట
- అప్రమత్తమైన అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతి పక్ష నేతలు



## తుపాను నష్టం అపారంగా ఉంది...

## రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది: నారా లోకేశ్

కోస్తా జిల్లాలపై పంజా విసిరిన మిగ్జామ్ తుపాను

కేంద్రం హెచ్చరికలను ఏపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్న లోకేశ్

కనీసం సమీక్ష కూడా జరపలేదని ఆగ్రహం

తుపాను బాధితులను టీడీపీ శ్రేణులు ఆదుకోవాలని పిలుపు



ఏపీ కోస్తా జిల్లాల్లో మిగ్జామ్ తీవ్ర తుపాను విలయం సృష్టించిన నేపథ్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. తుపాను తీవ్రతపై కేంద్ర విపత్తు సంస్థలు గత వారం రోజుల నుంచే హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం వాటిని పెడచెవిన పెట్టిందని విమర్శించారు. తుపాను హెచ్చరికలపై రాష్ట్ర ప్రభుత్వం కనీస సమీక్ష జరపకపోవడం దారుణమని పేర్కొన్నారు. తుపాను పరిస్థితులపై అప్రమత్తం చేయడం నుంచి సహాయక చర్యలు చేపట్టడం వరకు అన్నింటా ప్రభుత్వం విఫలమైందని లోకేశ్ అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఎప్పుడు, ఏ విపత్తు వచ్చినా ఆదుకునేది టీడీపీయేనని, అధికారంలో ఉన్నా లేకున్నా టీడీపీ మానవతాదృక్పథంతో సాయం చేసేదని లోకేశ్ వివరించారు. రాష్ట్రంలో తుపాను నష్టం తీవ్రస్థాయిలో ఉందని, ఈ కష్టకాలంలో ప్రజలకు టీడీపీ శ్రేణులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బాధితులకు ఆహారం, ఇతరత్రా సాయం అందించాలని సూచించారు.

## ఇజ్రాయెల్ భారీ స్కెచ్..

హమాస్‌కు చెక్ పెట్టేందుకు నీళ్లను ఆయుధంగా మార్చబోతుందా ?

గాజా స్ట్రిప్‌పై పూర్తిస్థాయిలో ఇజ్రాయెల్ సైన్యం పట్టుబిగించింది. హమాస్‌కు చెందిన కీలక స్థావరాలను ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో హమాస్ సొరంగాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సొరంగాలు ఇజ్రాయెల్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి. ఈ క్రమంలో వాటిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా సొరంగాలను సముద్రపు నీటితో నింపేందుకు రంగం సిద్ధం చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించింది. నవంబర్ మధ్యలోనే ఇజ్రాయెల్ సైన్యం అల్ షాతి శరణార్థి శిబిరానికి ఉత్తరాన ఓ మైలు దూరంలో ఐదు పంపులను ఏర్పాటు చేసిందని పేర్కొంది. ఇవి గంటకు వేల క్యూబిక్ మీటర్ల నీటిని పంప్ చేస్తాయని, వారాల్లోనే సొరంగాలను నీటితో ముంచేస్తాయని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీల్ జర్నల్ పేర్కొంది.

## తుపాను తీరం దాటినప్పటికీ రేపు కూడా వర్షాలు: ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ

బాపట్ల వద్ద తీరం దాటిన మిగ్జామ్ తుపాను

తుపాను క్రమంగా బలహీనపడుతుందన్న ఏపీఎస్ డీఎంఏ

పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడి

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మిగ్జామ్ తుపాను ఈ మధ్యాహ్నం తీరం దాటిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్ డీఎంఏ) పత్రికా ప్రకటన విడుదల చేసింది. మిగ్జామ్ తుపాను క్రమంగా బలహీనపడుతుందని, అయితే తుపాను తీరం దాటినప్పటికీ రేపు (డిసెంబరు 6) కూడా వర్షాలు పడతాయని ఏపీఎస్ డీఎంఏ వెల్లడించింది. బుధవారం నాడు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, ఏలూరు, కృష్ణా, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తీరం దాటినప్పటికీ ప్రతికూల వాతావరణం కారణంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఏపీఎస్ డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ అంబేద్కర్ వెల్లడించారు

TUE - M U_SAT - M U.qxd 05-12-2023 11:20 PM Page 2



మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

## సంపాదకీయం

# కాంగ్రెస్ ప్రభుత్వంపై గురుతర బాధ్యతలు !

తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న కాంగ్రెస్ పార్టీపై గురుతర బాధ్యతలు ఉన్నాయి. ఎన్నికల ముందు లేవనెత్తిన వివిధ సమస్యలను నెమరు వేసుకుని పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రధానంగా ఆర్థిక క్రమశిఓణ పాటించాల్సి ఉంది. ఉదార పథకాలను పక్కన పెట్టి బొక్కసం నిండుకునేలా మెల్లగా అడుగులు వేయాలి. అనేక పథకాలను సమీక్షించి కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఆర్థిక క్రమశిక్షణ సాధ్యం కాదు. ఇందులో ప్రధానంగా ధరణి అక్రమాలను నిరోధించాలి. రైతుబంధును సరళీకరించాలి. చిన్న, చిన్నాకరు రైతులకు మాత్రమే సాయం అందేలా చూడాలి. ఫామ్‌హౌజ్‌ల కోసం కొనుకున్న భూములకు రైతుబంధు అమలు చేయకుండా చూడాలి. కిలో రూపాయి బియ్యంపైనా సమీక్షించాలి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న తెల్లకార్డులను తొలగించాలి. పేదరికంపై హేతుబద్దత ఆధారంగా ముందుకు సాగాలి.డబ్బుల పందేరం చేసే కార్యక్రమం లేదా పథకం ఏదైనా సమీక్షించాల్సిందే. దళితబందు, బిసిబంధు లాంటి డబ్బుల పందేరాన్ని ఆపాలి. ఎస్సీ కార్పోరేషన్ను పునరుద్దరించి దళితులు స్వయంశక్తితో ఎదిగేందుకు వడ్డీరహిత రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించాలి. మార్కెట్లో బియ్యం ధరలు మండిపోతున్నాయి. ఈ క్రమంలో కిలో రూపాయి బియ్యం ఇవ్వడం దోచి పెట్టడమే తప్ప మరోటి కాదు. అలాగే ఇబ్బడిముబ్బడిగా సలహాదారు లను పెట్టే సంప్రదాయాన్ని పక్కన పెట్టాలి. వీటికి లక్షల్లో జీతాలు తగలేసి, ప్రభుత్వ ఖజానాను దివాళా తీయించడం మానుకోవాలి. ఇకపోతే విభజన సమస్యలపై కేంద్రంతో పోరాడి సాధించాలి. ఆనాడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పార్లమెంట్ వేదికగా నిలదీయడంలో తెలంగాణ కాంగ్రెస్ ముందుండాలి. ఎపి విభజన జరిగాక ఇరు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి పెంచలేక పోయాయి. అందువల్ల కేంద్రం నిర్మాణా త్మక సహకారం అందించలేక పోయింది. ఎపి రాజధానిపై కేంద్రం చేతులెత్తేసింది. పేరుకు అమరావతి అని గెజిట్ చూపుతున్నా జగన్ చేస్తున్న పనులకు సహకారం ఇస్తోంది. అందుకే జగన్ కూడా విశాఖ స్టీల్ ఆందోళనలను పట్టించుకోవడంలేదు. కడప ఉక్కును పక్కన పెట్టారు. బయ్యారం ఉక్కు ఊసే లేదు. ఇక ఏంచేశారో చెప్పడానికి ఏమీ లేదు. ఆత్మనిర్భరభారత్ పేరుతో మోడీ పదేపదే మాటలు వల్లిస్తున్నా ప్రయోజనం శూన్యం అని తేలింది. కనీసం ఉభయరాష్ట్రాల మధ్య సమస్యలను పట్టించుకోలేదు. అందుకు ఇటీవలి సాగర్ జలాల వివాదమే తాజా ఉదాహరణ. ఈ క్రమంలో తెలంగానలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వం విజబజన సమస్యలపై గట్టిగా నిలదీయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇప్పటికే కృష్ణా, గోదావరి జలవివాదాన్ని కూడా సత్వరంగా పరిష్కరించాలన్న ఆలోచన ప్రయత్నం చేయలేదు. విభజన సమస్యల పరిష్కారం పేరుతో కమిటీ వేసినా..విభజన హామీలపై మాత్రం కేంద్రం నోరు మెదపడం లేదు. దీనిపై ఈ రెండు రాష్ట్రాలు నేరుగానే పోరాడాల్సిన అవసరం వచ్చింది. సమస్యలను నాన్చకుండా త్వరగా పోరాడితేనే మంచిది. ఇకపోతే వివిధ సమస్యలపై ఎపిలో మాత్రం నేతలు నిలదీయలేక పోతున్నారు. చంద్రబాబు, కెసిఆర్‌లు కేంద్రంతో సయోధ్యతో ఉన్నా కూడా లాభం చేకూరలేదు. స్థానిక బిజెపి నేతలు కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సమస్యలు ప్రస్తావించి సాధించే తెలివిని ప్రదర్శించలేదు. దూకుడు రాజకీయాలతో, వారు చేస్తున్న విన్యాసాలు అభాసుపాలు చేస్తున్నాయి. మొత్తంగా విభజన వల్ల తెలంగాణ కొంత పురోగమిస్తున్నా ఎపిలో మాత్రం అలాంటి ఛాయలు కానరావడం లేదు. నాయకత్వ లోపం కూడా కారణంగా భావించాలి. ఈ క్రమంలో గత విభజన సమయంలో ఇచ్చిన హామీలను ముందుకేసి..అసలు కేంద్రం ఎందుకిలా వ్యవహరి స్తున్నదో నిలదీయాలి. ఇలా చేయడం వల్ల ఎపిలో కూడా కాంగ్రెస్‌కు లబ్ది చేకూరుతుంది. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం రాష్ట్రానికి ద్రోహం చేసినా వైసిపి, తెలుగుదేశం పార్టీలు పెద్దగా పోరాడలేదు. మోడీ బురిడీ కొట్టించి కాలయాపన చేయడంతో తొమ్మిదేళ్లు గడిపేశారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా కేంద్రం విధానాలపై రాజీపడకుండా ఎపి నేతలు పోరాడలేక పోతున్నారు. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న వైరుధ్యాల కారణంగా కేంద్రం లాభపడుతోంది. గతంలో దీర్ఘకాలం బిజెపితో టిడిపి సాగించిన పొత్తు రాజకీయాలు కూడా దీనికి ఒక కారణం. ఇకపోతే అధికారంలోకి రాకముందు జగన్ ఇచ్చిన అనేకానేక సమస్యలు ఆచరణకు నోచుకోవడం లేదు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడానికి, మూసేయడానికి వెనకాడలేదు. ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి కూడా అదే పని చేస్తున్నారు. కృష్ణపట్నం జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం అదానీకి ధారాదత్తం చేస్తున్నది. గంగవరం పోర్టును అప్పగించేశారు. సహకార చెక్కర, పాలసంఘాలను రెండు పార్టీలు దెబ్బతీశాయి. అందువల్ల మౌలికమైన ఆర్థిక విధానాలలో ఇద్దరికీ తేడా లేదు. తెలుగు ప్రజల భావోద్రేకాలకు అనుగుణంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను మాటవరసకు వ్యతిరేకిస్తున్నప్పటికీ గట్టిగా నిలబడి తెగువతో పోరాటానికి ముందుకు రావటం లేదు. ప్రత్యేకహోదాను పక్కనపెట్టి ఇద్దరూ కీచులాడుకుంటున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు సంక్షేమ పథకాలను పోటీలు పడి ప్రకటిస్తుంటారు. ప్రతిపక్షంలో ఉంటే ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఒక మాటగా వీరి తీరున్నది. నరేంద్రమోదీ నాయకత్వంలో బిజెపి రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు పూర్తికావస్తున్నా తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించకపోగా పొగపెట్టారు. ప్రస్తుత సందర్భంలో నరేంద్రమోదీ ఇకముందు ఏదో చేస్తారనో ఆశలు పెట్టుకుంటే అంతే సంగతులు ఆయనను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాల భవిష్యత్ ఏమిటన్నది ఉమ్మడిగా చర్చించాల్సిన అవసరం ఉన్నది.

# సిఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

**న్యూఢిల్లీ,డిసెబర్5(మరోఉదయం):**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థిగా పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది. సిఎల్‌పి నేతగా రేవంత్ పేరును కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ ప్రకటించారు. 7వ తేదీన రేవంత్ సిఎంగా ప్రమాణం చేస్తారని ప్రకటించారు. సిఎల్‌పి నేతగా రేవంత్‌ను ఎన్నుకున్నామని, అధిష్టానానికి అందిన నివేదకల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సిఎల్‌పీ తీర్మానం మేరకు నిర్ణయించామని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్ బాగా పనిచేశారని, కాంగ్రెస్ గెలుపునకు దోహదపడ్డారని అన్నారు. రేవంత్ ఓ డైనమిక్ లీడర్ అంటూ వేణుగోపాల్ తెలిపారు. ఢిల్లీలో మీడియా సమావేశంలో మాణజగం ఠాక్రే, డికె శివకుమార్ పాల్గొన్నారు. మంతరివర్గ కూర్పు తదితర విషయాలను రేపు ప్రకటిస్తామని అన్నారు. మరోవైపు అధిష్ఠానం పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాసేపటి క్రితమే గచ్చిబౌలిలోని హోటల్ ఎల్లా నుంచి ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు. అధిష్ఠానం నుంచి సీఎం పదవీపై స్పష్టమైన హామీ రావడంతోనే రేవంత్ ఢిల్లీ బయలు దేరి వెళ్లినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి అధికారం కైవసం చేసుకుంది. రేవంత్ ఢిల్లీ వెళ్లడంతో మంత్రివర్గ ఊహాగానాలకు తెరపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే సిఎం ఎంపిక, మంత్రివర్గ కూర్పుపై కాంగ్రెస్ కరసత్తు చేసింది. ఖర్గే నివాసంలో చర్చలు జరిగాయి. కెసి వేణుగోపాలు చర్చించారు. దీనిపై ఓనిర్ణయం తీసుకున్నారని సమాచారం. ముఖ్యమంత్రి పదవికి పలువురు కీలక నేతలు పోటీపడ్డారు. సోమవారమే కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రచారం జరిగింది. ఢిల్లీ వేదికగా మంగళవారం ఉదయం నుంచి వరుస భేటీలు సాగుతున్నాయి. మల్లికార్జున ఖర్గేతో రాహుల్ భేటీ అయ్యారు. తరవాత డికె శివకుమార్ కూడా భేటీ అయ్యారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు కొందరు ఢిల్లీకి చేరుకున్నారు. ఈ క్రమంలో సిఎం ఎవరన్నది ప్రకటించాల్సి ఉంది. అయితే అనూహ్యంగా హైదరాబాద్‌లో ఉన్న రేవంత్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. సిఎం పదవికి రేవంత్ పేరునే నేతలంతా ఖరారు చేశారని, మంత్రివర్గ కూర్పుపై తుదినిర్ణయం తీసుకునేందుకే రేవంత్‌ను ఢిల్లీకి రావాలని ఆదేశించారని సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కాంగ్రెస్ ముఖ్యనేతలతో కీలక సమావేశం జరిగిం ఈ భేటీలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క పాల్గొన్నారు. తెలంగాణకు కాబోయే సీఎం అభ్యర్థిపై చర్చించిట్లు తెలుస్తోంది. సీఎం అభ్యర్థి ఎంపికపై కాసేపట్లో ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తమకు ఆమోద యోగ్యమేనని భట్టి విక్రమార్క, ఉత్తమ్‌లు తెలిపారు. తన అభిప్రాయం కూడా కాంగ్రెస్ హైకమాండ్‌కు చెప్పానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీఎం అయ్యేందుకు నాకు అన్ని అర్హతలు ఉన్నాయని, మొదటి నుంచి తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం అభ్యర్థి ఎంపికపై హైకమాండ్ అన్ని ఆలోచనలు చేస్తుందని, నలుగురు.. ఐదుగురు రేసులో ఉండటం తప్పుకాదని ఉత్తమ్ అన్నారు. హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, పార్టీ అంతర్గత విషయాలు బయటకు చెప్పలేనని ఉత్తమ్ తెలిపారు. తాజాగా ప్రమాణస్వీకారానికి రాజ్‌భవన్‌లో సైతం ముమ్మర ఏర్పాట్లు జరిగాయి. ఈ క్రమంలో పార్టీ పరిశీలకుల సమావేశంలో సోమవారం సీఎల్పీ మీటింగ్ జరిగింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలంతా సీఎం ఎంపిక బాధ్యతను అధిష్ఠానానికి అప్పగించారు. సీఎం పదవి, కేబినెట్ బెర్తుల విషయంలో పంచాయితీ నేపథ్యంలో వాయిదాపడింది. ముఖ్య నేతలు పట్టువీడకపోవడంతో డీకే శివకుమార్‌తో పాటు పరిశీలకులను అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు సీనియర్లు సైతం ఢిల్లీలో మకాం వేశారు. ఎవరికి వారు తమ బెర్తుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి పదవి కోసం కూడా పలువురు నేతలు ఢిల్లీలో అప్పుడే లాబీయింగ్ మొదలు పెట్టారు. తాజాగా మరో నేత సైతం ఢిల్లీలో ప్రత్యక్షమ య్యారు. బెల్లంపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన జీ వినోద్ ఢిల్లీలో మకాం వేసారు. మంగళవారం కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీతో భేటీ అయ్యారు. అయితే, వినోద్ సోదరుడు సైతం వివేక్ చెన్నూరు నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. ప్రస్తుతం అన్నాదమ్ముళ్లు ఇద్దరు మంత్రి పదవి కోసం పోటీపడుతున్నారు. అయితే, ఇద్దరిలో ఒకరికి మాత్రమే పదవి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉండడంతో ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న వినోద్ ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పార్టీ అధినేత్రి సోనియాగాంధీని కలిశారు. తాను గతంలో మంత్రిగా పని చేశానని.. తనకు మరోసారి కేబినెట్‌లో అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది. మరో వైపు వివేక్ మాత్రం హైదరాబాద్‌లోనే ఉండి మంతనాలు చేస్తున్నారు. సీఎం రేసులో ఉన్న టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డితో మంతనాలు జరుపుతున్నారు. మంత్రి పదవి ఇస్తేనే కాంగ్రెస్‌లో చేరేందుకు వివేక్ సమ్మతించారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అన్నాదమ్ముళ్లు ఇద్దరు కేబినెట్ బెర్తు కోసం లాబీయింగ్ చేస్తున్నారు. సోనియా సమావేశం అనంతరం మీడియాతో వినోద్ మాట్లాడుతూ.. తాను 2004-2009 వరకు మంత్రిగా పని చేశానన్నారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన అవకాశంతో మరోసారి కేబినెట్‌లో చోటు చేసుకోసం రెక్వెస్ట్ కోసం ఢిల్లీకి వచ్చానని.. ఈ మేరకు సోనియాకు విజ్ఞాపనపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. మంత్రి పదవి ఖాయమనే సంకేతాలున్నాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎంపికపై సీనియర్లు చర్చలు జరుపుతున్నారన్నారు. ఇవాళ లేదంటే రేపు సీఎంను ప్రకటించే అవకాశం ఉందన్నారు. 7వ తేదీన.. లేదంటే 9న కొత్త సీఎం ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంటుందన్నారు. సీఎం అభ్యర్థిత్వంపై మల్లికార్జున ఖర్గే, డీకే శివకుమార్ చర్చలు జరుపుతున్నారన్నారు. ఎమ్మెల్యేల అందరికీ అభిప్రాయాలను తీసుకొని హైకమాండ్‌కు పంపారన్నారు. హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. తాను వెంకటస్వామి కొడుకునని.. హైకమాండే లా అన్నారు. ఏ ఆదేశాలు ఇచ్చినా స్వీకరిస్తామని.. నాకున్న అనుభవంతో మంత్రిత్వ శాఖ ఇచ్చినా మేనేజ్ చేయగలుగుతానన్నారు. ఐదేళ్లపాటు ఎలాంటి రిమార్క్ లేకుండా వైఎస్ కేబినెట్‌లో పని చేశానని.. తనకు మంచి అవగాహన ఉందన్నారు. తన సేవలను ఏలాగైనా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణ తదుపరి సీఎం ఎవరనేదానిపై తీవ్రమైన

ఉత్కంఠ కొనసాగుతున్న వేళ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో సీపీఐ నేతలు నారాయణ, చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేపథ్యంలో ఒకరినొకరు అభినందించుకోవడానికి హోటల్ ఎల్లాకు వచ్చారు. కాగా మల్లికార్జున ఖర్గేతో భేటీ అనంతరం తిరుగు పయనమైన పరిశీలకుడు, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ హైదరాబాద్ చేరుకోనున్నట్లు సమాచారం. నగరం చేరుకున్నాక సీనియర్లతో చర్చ అనంతరం సీఎం పేరుని అధికారికంగా ప్రకటించనున్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి పేరుని నిర్ణయించి ప్రకటన చేయనున్నారని తెలుస్తోంది. రేవంత్ పేరును ఖరారు చేస్తూ ఏఐసీసీ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ఈ విషయాన్ని డీకే శివకుమార్ ఎమ్మెల్యేలతో చెప్పిన తర్వాత ప్రకటన చేయనున్నారని సమాచారం.

కాగా సోమవారం హైదరాబాద్‌లో సీఎల్పీ భేటీ తర్వాత పరిశీలకుల బృందం ఢిల్లీ వెళ్లి అధిష్ఠానంతో చర్చించింది. ఆ వెంటనే భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఢిల్లీ వెళ్లి అధిష్ఠానం పెద్దలతో చర్చలు జరిపాయి. అయితే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాత్రం హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఈ క్రమంలో ఢిల్లీకి రావాలని పిలుపు రావడంతో హుటాహుటిన రేవంత్ బయలుదేరి వెళ్లారు.

మొదటిపేజీ తరువాయి

# మిచౌంగ్ తుఫాన్ బీభత్సం..

**ఉమ్మడి తూర్పు గోదావరి డిసెంబర్ 5(మరోఉదయం)**

మిఛాంగ్ తుఫాన్ బీభత్సం సృష్టించడంతో ఈదురు గాలులకు అధిక వర్షపాతంతో కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలోని వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిపోయి నష్టపోగా,పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి, విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ కు అంతరాయం కలిగింది.అధికారులు అప్రమత్తమై సకాలంలో సహాయక చర్యలు చేపట్టారు. కాట్రేనికోన మండలం కొప్పికుంట గ్రామంలో విద్యుత్ వైర్లు పై విరిగిపడిన కొబ్బరి చెట్లు , కరెంటు స్తంభాలు, కొప్పికుంట కుంట గ్రామంలో ఒక పెంకుటిల్లు పై పడిన కొబ్బరిచెట్లు లను కోత మిషన్లతో రెస్క్యూటీమ్ తొలగించారు.తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడం వల్ల సావరం విద్యుత్ నగర్ రోడ్లన్నీ జలమయంగా మారాయి ప్రజలు బయటకు రావాలంటే ఈ రోడ్లపై చాలా ఇబ్బందులు పడుతున్నారని సమాచారం తెలిసిన మున్సిపల్ కమిషనర్ వి అయ్యప్పరాయుడు మంగళవారం నాడు నీట మునిగిపోయిన రోడ్లను డ్రైనేజీల ను పరిశీలించి తక్షణమే డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయించి నీటిని మళ్లించే ఏర్పాట్లు చేస్తానని తెలియజేశారు.డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు తొందర్లోనే డ్రైనేజీ నిర్మాణం చేపడతామని తెలిపారు.అంబెద్కర్ కోనసీమ జిల్లా అతలాకుతలం అయింది.ఎడతెరిపి లేని వర్షాలు, బలమైన గాలులు జిల్లాను గత మూడు రోజులుగా కుదిపేస్తున్నాయి.జిల్లాలో వరి కోతలు జోరుగా సాగుతున్న వేళ మిచౌంగ్ తుఫాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. మరోవైపు సహాయక చర్యల్లో అదికార యంత్రాంగాం నిమగ్నమయ్యారు.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ప్రత్యేకాదికారి జయలక్ష్మి, కలెక్టర్ హిమాన్ను పలు ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పరిశీలించారు.ముంపు ప్రాంతాల్లో పంట రైతులను ఆదుకునేందుకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టారు. రాజోలు ప్రాంతంలో టోర్నడో ఏర్పడటం తో స్థానికులు కలవరం చెందారు.తుఫానుతో సముద్ర తీరంలో అలల ఉద్రుతి ఆందోళన కలిగించింది.దాదాపుగా పది అడుగుల ఎత్తువరకూ కెరటాలు ఎగసిపడుతున్నాయి.దీనికి తోడు శబ్ధం కూడిన గాలులతో సమీప గ్రామాల్లో కూడా కలకలం రేపింది. అయితే ముందస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా,ఎస్పీ శ్రీధర్ అదికార యంత్రాంగంని అప్రమత్తం చేశారు.తుఫాను రక్షణ ప్రత్యేకాదికారి జయలక్ష్మి పరిస్థితులను సమీక్షించారు. తుఫాను ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వీస్తున్న ఈదురు గాలులకు వరిచేలునేలకొరిగాయి.అబాజీపేట అమలాపురం, అయినవిల్లి, మామిడికుదురు తదితర మండలాల్లో కోత కోసిన పనలతో ఉన్న వరిచేలు భారీ వర్షాలకు పూర్తిగా ముంపు బారిన పడ్డాయి.జిల్లాలో 1.60లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా 60వేల ఎకరాల్లో ఇంకా వరి కోతలు పూర్తి కావాల్సి ఉంది. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు కూడా ఈ వర్షాలకు మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 30వేలు పైనే పెట్టుబడి అయిందని పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్లతో అన్నదాత కోలుకోలేని దెబ్బ తగులుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని పంట నష్టపరిహారం,ఇన్ పుట్ సబ్సిడీ ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం దళారులు ఆయన కాడికి దండుకోవడానికి చూస్తారని ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం రంగు మారినా,మొలక వచ్చినా తేమ శాతం తేడా ఉన్న నిబంధనలు సడలించి రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.పంట పొలాలనుఅదికార యంత్రాంగం పరిశీలించింది.అల్లవరం మండలం రెల్లిగడ్డ లో తుఫాన్ కారణంగా నష్టపోయిన వరి పంటను రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా, జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మి తో కలిసి పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి పి.గన్నవరం నియోజకవర్గంలో దెబ్బతిన్న వరి పంటలను మంగళవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరిశీలించారు. మామిడికుదురు మండలం నగరం గ్రామంలో అధికారులతో కలిసి పంట పొలాల్లోకి వెళ్లి నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. అన్నదాతలు అధైర్యపడొద్దని, ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తేమ శాతం చూడకుండా వెంటనే కొనుగోలు చేసి, మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.బలమైన గాలులకు కొన్నిచోట్ల వృక్షాలు, మరికొన్ని చోట్ల విద్యుత్ స్థంబాలు నేలకొరిగాయి.సఖినేటిపల్లి మండలం మోరి గ్రామం శ్రీ ముసలమ్మ తల్లి ఆలయం వద్ద తుఫాన్ బీభత్సం వల్ల భారీ వృక్షాలు నేలకొరిగింది.ముంపు ప్రాంతాల్లో డ్రైన్లలోని తూడు, గుర్రపు డెక్క ను ప్రభుత్వ యంత్రాంగం,ఉపాధి హామీ పథకం కింద కూలీలు ద్వారా సహాయక చర్యలు చేపట్టారు.ట్రాన్సకో ,రోడ్ల భవనాలు,పంచాయతీలు,రెవిన్యూ తదితర శాఖల ద్వారా సహాయ చర్యలను ముమ్మరం చేశారు.

# పార్లమెంట్‌లో ప్లకార్డుల ప్రదర్శన నిషేధం

## ఎవరైనా అలాచేస్తే చర్యలు తీసుకుంటాం

## ఎంపిలను హెచ్చరించిన స్పీకర్ ఓంబిర్లా

**న్యూఢిల్లీ,డిసెబర్5(మరోఉదయం):**

లోక్‌సభలో ప్లకార్డులు తీసుకుని రావొద్దని.. సభలో గౌరవం, క్రమశిక్షణను కొనసాగించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు హెచ్చరిక జారీ చేశారు. ప్లకార్డులు సరికాదన్నారు. ఇది పార్లమెంట్రీ వ్యవహారాలకు తగదన్నారు. ఒకవేళ ఎవరైనా ప్లకార్డులు తీసుకొస్తే మాత్రం.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. తనపై కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ ఎంపీ రమేశ్ బిధురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. బీఎస్పీ సభ్యుడు డానిష్ అలీ పార్లమెంట్ ఎదుట ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే.. స్పీకర్ ఓంబిర్లా ఎంపీలను ఈ మేరకు హెచ్చరించారు. సోమవారం డానిష్ అలీ తన మెడకు ప్లకార్డు వేలాడదీసుకుని పార్లమెంట్ బయట నిరసన వ్యక్తం చేశారు. తనని బీజేపీ ఎంపీ రమేశ్ బిధురి కించపరిచే వ్యాఖ్యలు చేశారని.. అగౌరవ పరిచారని అందులో రాసి ఉంది. కాబట్టి.. ఆయనపై చర్యలు తీసుకొని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి స్పీకర్ ఓంబిర్లా దృష్టికి తీసుకెళ్లాలి. ప్లకార్డును తొలగించాలని డానిష్ అలీని సూచించాలని ఆయన అభ్యర్థించారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఓంబిర్లా స్పందిస్తూ.. సోమవారం జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ మీటింగ్‌లో కొత్త పార్లమెంట్ హౌస్‌లో ప్లకార్డులు తీసుకురాబోమని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. పార్లమెంట్‌లో గౌరవం, క్రమశిక్షణ పాటించాలని అందరికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఒకవేళ ప్లకార్డులు తీసుకొస్తే.. ఆ ఎంపీలపై చర్యలు తీసుకుంటా అని ఓంబిర్లా చెప్పుకొచ్చారు. ప్లకార్డులతో సభకు రావడం పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమని, బీఎస్పీ ఎంపీ డానిష్ అలీని వెంటనే సభ నుంచి బయటకు వెళ్లాలని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. సభ నిబంధనలను ఉల్లంఘించవద్దని ప్రతి సభ్యునికీ విజ్ఞప్తి చేశారు. అందరూ సంయమనం కొనసాగించాలని, సానుకూల మనస్సుతో రావాలని ఆశిస్తున్నానని చెప్పారు. అయితే.. స్పీకర్ మాటల్ని పట్టించుకోకుండా రమేష్ బిధూరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డానిష్ అలీ తన నిరసనలను కొనసాగించారు. దీంతో స్పీకర్ సహనం కోల్పోయారు. ప్లకార్డులతో సభకు రావడానికి ఎవరినీ అనుమతించనని తెగేసి చెప్పారు. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

# క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేసిన వినయ్ భాస్కర్

**హన్మకొండ,ఫిబ్రవరి10(మరోఉదయం):**

మొన్నటి ఎన్నికల్లో ఓడిపోవడంతో హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని దాస్యం వినయభాస్కర్ ఖాళీ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన వినయభాస్కర్... కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. గత ప్రభుత్వంలో ఆయన చీఫ్‌విప్‌గా పనిచేశారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలను కట్టించారు. ఈ క్రమంలో ఆయన సోమవారం అధికారిక క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. హంటర్‌రోడ్డులోని విల్లాకు మారారు. క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న అభిమానులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి వినయభాస్కర్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. ఇన్నేళ్ల అనుబంధాన్ని పంచుకున్నారు. వారిని చూసి వినయభాస్కర్ కూడా చలించిపోయారు. బాధతో అభిమానులను ఓదార్చారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. అలాగే నిరంతరం ప్రజల్లోనే ఉంటామని అన్నారు.

# పాగాల సంపత్‌కు కెటిఆర్ నివాళి

## సంపత్ మరణం పార్టీకి తీరని లోటని వ్యాఖ్య

## కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ

**జనగామ,ఫిబ్రవరి10(మరోఉదయం):**

బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పార్థివదేహానికి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సంపత్‌రెడ్డి అకాల మరణం కలిచివేసిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సంపత్‌రెడ్డి (55) సోమవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. హనుమకొండలోని తన నివాసంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రాజయ్య తదితరులు ఉన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సంపత్ రెడ్డి మృతికి నివాళి అర్పించారు.



# యశస్విని గెలుపుతో మోకాళ్లపై మొక్కులు

**జనగామ,ఫిబ్రవరి10(మరోఉదయం):**

పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్విని రెడ్డి గెలిచిన సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన పార్టీ కార్యకర్త జూకంటి బీరన్న స్థానిక శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. సోమవారం మోకాళ్లపై ఆలయ మెటె÷-లెక్కి మొక్కులు తీర్చుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ గెలిచినందుకు మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈరవెన్ను గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు మెట్టుకో కొబ్బరికాయ కొట్టి మొక్కలు చెల్లించారు. ఈ సందర్భంగా సోమేశ్వర్ మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఇదే మొదటిసారి అన్నారు. యశస్వినిరెడ్డినిగెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటమి జీర్ణించుకోలేక ఈవీఎంలపై కాంగ్రెస్ ఆరోపణలు

**భోపాల్,డిసెంబర్5(మరోఉదయం):**

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఘోర పరాజయం అనంతరం ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ ఈవీఎంలపై సందేహం వ్యక్తం చేయడం పట్ల బీజేపీ మండిపడింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమితో దిక్కుతోచని స్థితిలో ఆ పార్టీ ఈవీఎంలను నిందిస్తోందని కాషాయ పార్టీ ఎద్దేవా చేసింది. చిప్ ఉన్న ఏ మెషీన్‌ను అయినా హ్యాక్ చేయవచ్చని, 2003 నుంచి తాను ఈవీఎంలతో ఓటింగ్‌ను వ్యతిరేకిస్తున్నానని మధ్యప్రదేశ్ మాజీ సీఎం కూడా అయిన దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. సింగ్ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తోసిపుచ్చారు. ఓటమి ఎదురైన తర్వాతే కాంగ్రెస్ ఈ ఆరోపణలు గుప్పిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ తెలంగాణలో గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో విజయం సాధించినప్పుడు ఈవీఎంల గురించి మాట్లాడలేదని అన్నారు. సనాతన ధర్మాన్ని మీరు విమర్శిస్తే కాంగ్రెస్ పరిస్థితి ఇలాగే ఉంటుందని ఆ పార్టీ నేత ప్రమోద్ కృష్ణ సరిగ్గా చెప్పారని గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. ఇండియా పేరిట ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన ఫ్రంట్ విపక్ష కూటమి కాదని, అది అహంకార కూటమి అని అది కుప్పకూలడం ఖాయమని గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. మరోవైపు ఈవీఎంల పనితీరుపై ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కూడా సందేహాలు వ్యక్తం చేశారు. ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# స్కిల్ కేసులో అప్రూవర్‌గా చంద్రకాంత్

**విజయవాడ,ఫిబ్రవరి10(మరోఉదయం):**

టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని కొల్లగొట్టిన 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏ13 నిందితుడు చంద్రకాంత్ షాని ఏసీబీ కోర్టు ముందు సీఐడీ అధికారులు హాజరుపర్చారు. అప్రూవర్‌గా మారుతున్నట్లు కోర్టు ఎదుట చంద్రకాంత్ షా తెలిపారు. తదుపరి విచారణను ఏసీబీ కోర్టు జనవరి5కి వాయిదా వేసింది. చంద్రకాంత్ షా స్టేట్‌మెంట్‌ని జనవరి 5న ఏసీబీ కోర్టు రికార్డు చేయనుంది. షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా చంద్రబాబు ముఠా అడ్డగోలుగా నిధులను అక్రమంగా తరలించారన్నది స్పష్టమైన సంగతి తెలిసిందే. ఈ బాగోతంలో కీలక పాత్రధారిగా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా అప్రూవర్‌గా మారారు. ఈ కేసులో చంద్రకాంత్ షాను సీఐడీ గతంలో అరెస్టుచేయగా ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు.

# మేం సురక్షితంగా లేము : విశాల్

**చెన్నై, డిసెంబర్5(మరోఉదయం):**

మిగ్‌జాం తుఫాన్ తాకిడికి తమిళనాడు రాజధాని చెన్నై అతలాకుతలమైంది. భీకర గాలులు, కుండపోత వానతో చెన్నై సహా పలు జిల్లాల్లో అనేక ప్రాంతాలు నీటమునిగాయి. సోమవారం నగరంలో కురిసిన భారీ వర్షం ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లపైకి వరదనీరు రావటంతో కార్లు, ఇతర వాహనాలు కొట్టుకుపోయాయి. తుఫాన్ ప్రభావంతో చెన్నై వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కరెంటు, ఆహారం, నీరు లేక తిప్పలు పడుతున్నారు. నగరంలో నెలకొన్న పరిస్థితులపై ప్రముఖ సినీ నటుడు విశాల్ స్పందించారు. 2015లో వచ్చిన వర్షానికే నగరం పూర్తిగా స్తంభించిపోయిందని గుర్తు చేశారు. అది జరిగి ఏళ్లు గడుస్తున్నా నగర పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేకపోగా.. మరింత అధ్వానంగా తయారైందంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'డియర్ ప్రియా రాజన్ (చెన్నై మేయర్), గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్, ఇతర అధికారులకు.. మీరంతా మీ కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితంగా ఉన్నారని భావిస్తున్నా. ముఖ్యంగా వర్షం కారణంగా పారే డ్రైనేజీ నీరు మీఇళ్లలోకి రావనుకుంటున్నా. మీ ఇళ్లకు ఎలాంటి లోటూ లేకుండా కరెంట్, ఆహారం, మంచి నీరు అందుతోందని భావిస్తున్నా. అయితే, ఇదే నగరంలో మీతోపాటు నివసిస్తున్న మేమంతా మీలా సురక్షితంగా లేం. మీరు చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రాజెక్ట్ సింగపూర్ కోసమా..? లేక చెన్నై కోసం ఉద్దేశించిందా..? 2015లో ఇలాంటి పరిస్థితి నెలకొన్నప్పుడు ప్రజలంతా రోడ్లపైకి వచ్చారు. వారికి మేం సాయం అందించాం. ఆ ఘటన జరిగి 8 ఏళ్లు అయ్యింది. అయినా నగర పరిస్థితి మారకపోగా.. అంతకు మించి అధ్వానమైన పరిస్థితిని చూడటం దయనీయంగా ఉంది. ఈ సారి కూడా బాధితులకు మేమంతా ఆహారం, నీటిని సరఫరా చేసి వారిని ఆదుకుంటాం. అదేవిధంగా ప్రజా ప్రతినిధులందరూ వారివారి నియోజకవర్గాల్లో బయటకు వచ్చి బాధితులకు అండగా నిలుస్తారని నేను భావిస్తున్నా. ప్రజల్లో భయం, ఆందోళనను కాకుండా? విశ్వాసాన్ని నింపాలని కోరుకుంటున్నా. వారికి సాయం చేస్తారని ఆశిస్తున్నా. ఇలా రాయాల్సి వస్తున్నందుకు నేను సిగ్గుతో తలదించుకుంటున్నా. మీరేమీ అద్భుతాలు సృష్టిస్తారని ఆశపడటం లేదు. కనీసం మీ బాధ్యతను నిర్వర్తిస్తే చాలు' అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.



# జీతాలు చెల్లించేందుకు ఇల్లును తాకట్టుపెట్టిన బైజూస్ ఫౌండర్

**న్యూఢిల్లీ,డిసెంబర్5(మరోఉదయం):**

ప్రముఖ ఎడ్‌టెక్ స్టార్టప్ బైజూస్ గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సంస్థలో ఆర్థిక కష్టాలు మరింత తీవ్రమైనట్లు తెలుస్తోంది. ఎంతలా అంటే.. చివరికి అందులో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో బైజూస్ ఉన్నట్లు సమాచారం. దీంతో జీతాలు చెల్లించేందుకు బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్ తన ఆస్తులను తాకట్టు పెట్టి మరీ రుణం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. బెంగళూరు లో కుటుంబసభ్యులకు చెందిన రెండు ఇళ్లతోపాటు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఓ విల్లాను రవీంద్రన్ తాకట్టు పెట్టినట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఆ ఇళ్లను తాకట్టు పెట్టి 12 మిలియన్ డాలర్లను సమీకరించినట్లు సదరు కథనాలు వెల్లడిస్తున్నాయి. ఆ డబ్బుతో బైజూస్ మాతృసంస్థ 'థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్' ఉద్యోగులకు వేతనాలు చెల్లించినట్లు పేర్కొన్నాయి. అయితే కంపెనీ వర్గాలు మాత్రం ఈ వార్తలను ధ్రువీకరించ లేదు.



# 550 విమానాలు రద్దుచేసిన ఇండిగో

**చెన్నై,డిసెంబర్5(మరోఉదయం):**

మిగ్‌జాం తుఫాన్ తాకిడికి తమిళనాడు రాజధాని చెన్నై అతలాకుతలమైంది. సోమవారం కురిసిన భారీ వర్షం కారణంగా చెన్నై విమానాశ్రయం నీటమునిగింది. రన్‌వేపై నీరు నిలిచిపోవడంతో ఎయిర్‌పోర్టును అధికారులు మూసివేసిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం ఉదయం వర్షం తెరిపినివ్వడంతో రన్‌వేపై నిలిచిన నీటిని సిబ్బంది తొలగించారు. దీంతో విమానాల రాకపోకలను మధ్యాహ్నం నుంచి ప్రారంభించారు. అయితే విమానాశ్రయాన్ని మూసివేయడంతో పెద్దఎత్తున విమానాలు రద్దయ్యాయి. ఈ క్రమంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ కూడా భారీగా తమ సర్వీసులను క్యాన్సల్ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో చెన్నై మీదుగా నడవాల్సిన 550 విమానాలను రద్దు చేసినట్లు సంస్థ ప్రకటించింది. అయితే నేటి మధ్యాహ్నం నుంచి విమాన సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపింది. కాగా, తుఫాను ప్రభావంతో చెన్నపట్నంలో ఆదివారం రాత్రి నుంచి వర్షం దంచికొడుతున్నది. దీంతో చెన్నై మహానగరానికి వెళ్లాల్సిన విమానాలు, రైళ్లు పెద్ద సంఖ్యలో రద్దయ్యాయి.




# వాతావరణ మార్పులపై నివేదిక విడుదల

**న్యూఢిల్లీ,డిసెంబర్5(మరోఉదయం):**

వాతావరణ మార్పులపై దుబాయ్‌లో సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ ఓ నివేదికను రిలీజ్ చేసింది. గత దశాబ్దం అంటే 2011 నుంచి 2020 వరకు.. ఇండియాలో వాతావరణ మార్పులు ప్రభావం ఉన్నట్లు రిపోర్టులో తెలిపారు. కొన్నేళ్లు వర్షాలు, కొన్నేళ్లు ఎండలు దంచికొట్టినట్లు ఆ నివేదికలో వెల్లడించారు. ఇప్పటి వరకు ఉన్న రికార్డుల ప్రకారం.. గత దశాబ్దంలో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు తేలింది. కాప్28 సమావేశంలోనూ ఈ విషయాన్ని వెల్లడించిన విషయం తెలిసిందే. గత ఏడాది వాయవ్య భారత్, పాకిస్థాన్, చైనా, అరేబియా దీవుల్లోని దక్షిణ భాగాల్లో తడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్లు డబ్ల్యూఎంవో తన నివేదికలో పేర్కొన్నది. ఈ ప్రదేశాల్లో వెట్ డికేడ్ నమోదు అయినట్లు చెప్పింది. ఇక 2011 నుంచి 2020 వరకు.. వేడి వాతావరణం కూడా అధికంగానే నమోదు అయ్యింది. 1961 నుంచి 1990 వరకు పోలిస్తే.. ఈశాన్య ఆసియా, యూరోప్, దక్షిణ ఆఫ్రికా, మెక్సికో, ఆస్ట్రేలియా దేశాల్లో మాత్రం వేడి వాతావరణం రెట్టింపు అయినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా టెంపరేచర్లు పెరగడంతో.. అతిశీతల వాతావరణ పరిస్థితులు లేకుండాపోయినట్లు తెలుస్తోంది. అతిశీతల రాత్రులు గత దశాబ్దంలో.. 1961-90తో పోలిస్తే 40 శాతం పడిపోయినట్లు రిపోర్టులో వెల్లడించారు. భారత్‌లో రుతుపవనాల వల్ల తీవ్ర నష్టం 2013లో జరిగినట్లు పేర్కొన్నారు. ఆ సంవత్సరం కురిసిన వర్షాల వల్ల హిమాలయ ప్రాంతాల్లో తీవ్ర వరదలు వచ్చాయన్నారు. వర్షాలు, మంచుచరియలు కరిగిపోవడం వల్ల ఫ్లడ్స్ వచ్చాయి. ఇక 2018, 2019, 2020లో వచ్చిన వరదల వల్ల కేరళలో తీవ్ర నష్టం జరిగింది. 2011 నుంచి 2020 వరకు ఇండియాలో కరువు కూడా నమోదు అయ్యింది. 2011లో సుమారు 28 రాష్ట్రాల్లో కరువును ప్రకటించారు. దీంతో తీవ్ర ఆహార, నీటి కొరత ఏర్పడింది. పంటలు ఎండిపోవడం వల్ల ఆ సమయంలో ప్రజలు ఎక్కువ శాతం ప్రభుత్వ ఆహార సరఫరా(పీడీఎస్) వ్యవస్థపై ఆధారపడ్డారు.కరువు ప్రాంతాల్లో సుమారు 82 శాతం ఇండ్లల్లో ఆహార అభద్రత ఏర్పడినట్లు రిపోర్టులో తెలిపారు. 2001-2010 దశాబ్దంతో పోలిస్తే 2011-2020 మధ్య కాలంలో అంటార్కిటికాలో 75 శాతం మంచు గడ్డలు కరిగిపోయాయి. గత దశాబ్దంలో చాలా వరకు దేశాల్లో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు డబ్ల్యూఎంవో సెక్రటరీ జనరల్ పెట్టెరి తలాస్ తెలిపారు. సముద్రాల్లో వేడి విపరీతంగా పెరుగుతోందని, సముద్ర నీటి మట్టం కూడా ఊహించని వేగంతో పెరుగుతున్నట్లు డబ్ల్యూఎంవో తెలిపింది. హీట్‌వేవ్స్ వల్ల అత్యధిక సంఖ్యలో గత దశాబ్దంలో మరణాలు రిపోర్టు అయ్యాయి.



# ఈదురుగాలులకు కూలిన ఐరన్ రాడ్స్

**విజయవాడ,ఫిబ్రవరి10(మరోఉదయం):**

మిచౌంగ్ తుఫాన్ రాష్ట్రంలో బీభత్సం సృష్టిస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు భానునగర్ వద్ద తుఫాన్ కారణంగా ప్రమాదం చోటు చేసుకుంది. భారీ ఈదురుగాలులతో ఐరన్ రాడ్స్ కుప్పకూలాయి. తీవ్రమైన గాలికి బిల్డింగ్‌ప్లాస్టింగ్ సపోర్టింగ్ కోసమా కట్టిన పరంజ కూలిపోయింది. సుమారుగా ఐదంతస్తులపై నుంచి పరంజ జారి పడిపోయింది. ఐరన్ రాడ్లు ఒక్కసారిగా ఐదు అంతస్తులపై నుంచి పడిపోవడంతో సుమారుగా ఐదు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఒక ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఐరన్ రాడ్లు పడిన సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. భారీ నష్టం వాటిల్లడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఢిల్లీ నివాసం ఖాళీకి కెసిఆర్ ఆదేశాలు

## ప్రగతిభవన్ నుంచి ఖాళీ చేస్తున్న అధికారులు

**హైదరాబాద్,ఫిబ్రవరి10(మరోఉదయం):**

ప్రగతి భవన్ ను ఖాళీ చేస్తున్న తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఢిల్లీలోని అధికారిక నివాసాన్ని కూడా ఖాళీ చేస్తున్నారు. ముఖ్యమంత్రులకు ఢిల్లీలో ఓ అధికారిక నివాసం కేటాయిస్తారు. ఎంపీగా ఉన్నప్పుడు కేటాయించిన ఇంటినే.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా కొనసాగిస్తున్?రు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా కూడా రాజీనామా చేసినందున ఆ ఇంటిని పార్లమెంట్ కు అప్పగించాల్సి ఉంది. ఢ÷ల్లీకి ఎప్పుడు వెళ్లినా తుగ్లక్ రోడ్డులోని ఇంట్లో కేసీఆర్ ఉంటారు. ఎంపీగా ఓడిపోయిన తర్వాత కవిత కూడా ఢిల్లీ ఎప్పుడు వెళ్లినా ఆ ఇంట్లోనే ఉంటారు. రెండు దశాబ్దాలుగా దేశ రాజధాని ఢిల్లీలో కేసీఆర్ అధికారిక నివాసంగా ఉంది. 2004 నుండి ఢిల్లీలోని తుగ్లక్ రోడ్‌లోని ఇల్లు అప్పట్లో కేసీఆర్ ఎంపీగా ఉన్నప్పటి నుండి అధికారిక నివాసంగా ఉంది. ఆ తర్వాత సీఎంగా ఉన్న సమయంలో ఆ ఇంటిని అధికారిక నివాసంగా ఎంచుకున్నారు. ప్రస్తుతం తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయింది.రాష్ట్రంలో గెలిచిన తర్వాత కేసీఆర్ రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. సీఎం హోదాలో హస్తినకు వచ్చినప్పుడల్లార ఇదే ఇంట్లోనే ఉండేవారు. అధికారం కోల్పోయిన ఏ ప్రజాప్రతినిధి అయినా తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేయడానికి ఒక నెల

సమయం ఉంటుంది. కానీ, కేసీఆర్ ఆదేశాల మేరకు రెండు మూడు రోజుల్లో ఇల్లు పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ఆ ఇల్లు ఖాళీగా ఉంటే రెండు దశాబ్దాలుగా ఈ ఇంటితో కేసీఆర్‌కు ఉన్న సంబంధం తెగిపోతుంది. 2004లో టీఆర్ఎస్ తరఫున కరీంనగర్ నుంచి ఎంపీగా ఎన్నికై మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో కార్మిక శాఖ మంత్రిగా కేసీఆర్ పనిచేశారు. ఆ సమయంలో కేంద్ర మంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు తుగ్లక్ రోడ్డులోని టైప్ 8 క్వార్టర్‌ను కేటాయించింది. 2006లో కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన కేసీఆర్.. ఉప ఎన్నికల్లో ఎంపీగా గెలిచి అదే సభలో కొనసాగారు. 2009లో మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన అదే నివాసంలో ఉంటున్నారు. 2014లో తెలంగాణ సీఎం అయిన కేసీఆర్.. ముఖ్యమంత్రులకు ఢిల్లీలో అధికారిక నివాసాలను కేటాయిస్తుంది కేంద్ర ప్రభుత్వం. ఇందులో భాగంగా అదే నివాసాన్ని కేసీఆర్ కు కేటాయించారు. అదే సమయంలో కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్ ఎంపీగా గెలుపొందారు. ఆమె ఆ నివాసాన్ని తన అధికారిక నివాసంగా కూడా ఎంచుకుంది. ఆ క్వార్టర్ ముఖ్యమంత్రి, ఎంపీ కవితకు అధికారిక నివాసంగా మారింది. 2018లో కేసీఆర్ రెండోసారి సీఎం అయిన తర్వాత అదే నివాసంలో కొనసాగారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండబోతున్న సమయంలో కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారిక భవనాలను ఖాళీ చేయాల్సిందే. ఇప్పటికే పలువురు మంత్రులు, ఓడిపోయిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ అధికారిక భవనాలను ఖాళీ చేస్తున్నారు. క్యాంపు కార్యాలయాల్లోనే తమ సామాగ్రిని తరలిస్తున్నారు. సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్‌ను కూడా కేసీఆర్ ఖాళీ చేస్తున్నారు.

# అన్నప్రసాదంలో భక్తుల ఆందోళన

**తిరుమల,ఫిబ్రవరి10(మరోఉదయం):**

వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో భక్తులు నిరసనకు దిగారు. టీటీడీ భక్తులకు వడ్డించిన అన్నం బాగోలేదంటూ టీటీడీ సిబ్బందిపై మండిపడ్డారు. భక్తులకు ఇలాంటి అన్నం పెడతారంటూ భక్తులు టీటీడీ సిబ్బందిని నిలదీశారు. ఒక్కసారికి క్షమించి వదిలెయ్యమని టీటీడీ సిబ్బంది భక్తులను కోరారు. ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పాలంటూ భక్తులు డిమాండ్ చేశారు. భక్తులకు సర్ది చెప్పి టీటీడీ సిబ్బంది పంపించివేసింది.

మార్పు కోసం ...
మరో ఉదయం

# మూడు రాష్ట్రాల ఫలితాలతో మోడీలో ఆత్మవిశ్వాసం

**ఇక తనకు తిరుగులేదన్న భావనలో ప్రధాని**

**ప్రధాన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలం**

**ప్రజలకు ప్రతికూలంగా మారిన ఆర్థిక విధానాలు**

న్యూఢిల్లీ,డిసెంబర్5(మరోఉదయం):

మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి దాదాపు తొమ్మిన్నరేళ్లు పూర్తి కావస్తోంది. మరోమారు అధికారం తమదే అన్న ధీమాలో ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో అధికారం దక్కడంతో తిరుగలేని నేతగా ఎదిగారు. తెలంగాణలో కూడా ప్రభుత్వం వచ్చే క్రమంలో వేసిన వెనకడుగు, తప్పటడుగుల వల్ల ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. కెసిఆర్‌తో లోపాయకారి ఒప్పందం కాస్తా తెలంగాణలో బిజెపి ఎదుగుదలకు బ్రేక్ వేసింది. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో 8 సీట్లు రావడంతోనూ తమకు తిరుగులేదన్న రీతిలో బిజెపి నేతలు ఉన్నారు. ప్రధాని మోడీ కూడా అంతకుమించి ఆత్మవిశ్వాసం తో ఉన్నారు.కేంద్రమంత్రులు ఎందరు ఉన్నా వారంతా డమ్మీలే. అంతేగాకుండా అంతా నమో అంటూ స్మరించే స్థాయికి చేరుకునేలా చేశారు. తనకంటూ ఒక ప్రత్యేక అభిమాన భక్తగణాన్ని దేశవిదేశాల్లో రూపొందించుకోవడం లోనూ మోడీ విజయం సాధించారు. అందుకే మోదీని తీవ్రంగా విమర్శించేవారిని మించి ఆయనను గుడ్డిగా సమర్థించేవారు ఎక్కువగా ఉన్నారు. భారతీయ జనతా పార్టీకి బలం తానే అన్న రీతిలో ఇప్పుడు పార్టీ పరిస్థితి తయారయ్యింది. మోదీ, ఆయన విధానాల పట్ల వ్యతిరేకత పెరుగుతున్నా దానిని ఆయన లెక్క చేయడం లేదు. ఆర్థిక విధానాలు సవ్యంగా ఉన్నాయని, ధరలు అదుపులో ఉన్నాయని, నిరుద్యోగం నియంత్రణలో ఉన్నదని చెప్పేందుకు విపరీతమైన ప్రచారాలు వివిధ రూపాల్లో సాగుతున్నాయి. మోదీ నిరంకుశ, ఏకపక్ష విధానాల వల్ల దేశ సమస్యలే కాదు..ఉభయ తెలుగు రాష్ట్రాలకు కూడా సమీప దూరంలో పరిష్కారం అవుతాయనడానికి లేదు. ప్రధానమంత్రి సమాఖ్య స్ఫూర్తితో పని చేస్తున్నారనడానికి లేదు. రాష్ట్రాలను గౌరవిస్తున్నానని చెప్పుకోవడం మినహా వారిని గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నాలు ఎప్పుడూ కొనసాగిస్తుంటారు. మోదీ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు కేంద్ర ఏజెన్సీలను అప్పుడప్పుడూ ప్రయోగి స్తూనే ఉంటారు. ఇలాంటి ఆలోచనా ధోరణితో ఉన్న నేత మోడీ. ఇకముందు కూడా ఇలాగే ఉంటారు. తను చేయాలనుకున్నదే చేస్తారు. చెప్పదల్చుకున్నదే చెబుతారు. నోట్లరద్దు బాధలు, జిఎస్టీ వాతలు, పెట్రోదరల బాధలు, గ్యాస్ మంటలు అయనకు పట్టవు గాక పట్టవు. అలాగే దేశ ప్రజల సమసల్యు పెద్దగా పట్టించుకోరు. అలాగే ఉభయ రాష్ట్రాల సమస్యలను కూడా పట్టించుకుంటారన్న నమ్మకం కూడా లేకుండా పోయింది. అందుకు ఈ పదేళ్ల కాలమే నిదర్శనం. మరోవైపు ప్రజలు స్వేచ్ఛగా బతికే అవకాశం లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోంది. మోడీ తాను కోరుకున్న విధంగా తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో కృతకృత్యులు అయ్యారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలినా అది వారి దృష్టిలో పడడం లేదు. పద్దా అదో సమస్యగా చూడడం లేదు. ఇకపోతే ధరలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు. పెట్రో ధరలపై అదుపు లేకుండా పోతోంది. సామాన్యులకు కిరోసిన్, చక్కెర కోటాలు బంద్ చేశారు. పార్టీలో చర్చ అన్నది లేకుండా తక్షణ నిర్ణయాలు తీసుకుని అమలు చేసేలా మోడీ పాలనా వ్యవస్థ సాగుతోంది. మోడీ వచ్చాక బిజెపిలో ఏకవ్యక్తి నిర్ణయాలకు బీజం వేశారు. ప్రధానిగా నరేంద్రమోడీ తాను అనుకున్న విషయాలను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు వాటిని ప్రజలపై గట్టిగానే రుద్దుతున్నారు. అలా రుద్దుతున్న విషయాలనే తాను సాధించిన విజయాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత లేదా ప్రజల జీవితాల్లో మార్పులు గోచరించాయా లేదా అన్న విషయాలను వదిలేసి, తాము చేసిన నిర్ణయాలను ప్రజలపై రుద్ది ఆనందిస్తున్నారు. పదేళ్ల యూపిఎ పాలన నుంచి ప్రజలు కోరుకున్న విముక్తి లభించలేదు కదా కొత్త సమస్యలు చుట్టుకున్నాయి. రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. సరికదా పుట్టుకనుంచి చావువరకూ ఆధార్‌తో అనుసంధానించే పని సాగుతూనే ఉన్నది. ఉన్న చట్టాలను సవరిస్తూ, కొత్త నిబంధనలు తెస్తూ ప్రభుత్వం మొండిగా పోతున్నది. ఆధార్‌లోని ప్రతి వివరం అత్యంత కీలకమై, కోట్లాదిమంది జీవితాలతో ముడిపడి ఉన్నప్పుడు ముందుగా వాటిని సాధ్యమైనంత ప్రక్షాళించేందుకు ప్రభుత్వం ప్రయత్నించివుంటే బాగుండేది. మొత్తంగా ఒక్కొక్కటిగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలన్నీ మోడీ ఆలోచనలే తప్ప ఉమ్మడి ఆలోచనలు లేదా ఉమ్మడిగా చర్చించి తీసుకున్న నిర్ణయాలు కావు. రెండుపూటలా తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసకుంటే అదే మేలు. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించకపోవడం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం

# దెబ్బతిన్న పంట రైతులను తక్షణమే ఆదుకోవాలి : దేవినేని ఉమా

ఎన్టీఆర్ జిల్లా,డిసెంబర్5(మరోఉదయం):

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను మాజీ మంత్రి దేవినేని ఉమా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో పంటలు నీట మునిగి, గాలులకు నేలవాలి రైతుల పూర్తిగా నష్టపోయారన్నారు. దేశానికి పట్టెడన్నం పెట్టాలన్న ఉద్దేశంతో కష్టపడే రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని తెలిపారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఉదారంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తూరు తాడేపల్లిలో 2 వేల ఎకరాల వరకు పంట దెబ్బతిన్నదని.. అధికార యంత్రాంగం దెబ్బతిన్న పంటలను, రైతుల వివరాలను త్వరితగతిన నమోదు చేసి రైతును ఆదుకోవాలన్నారు. ఎకరానికి 30 నుండి 35 వేల రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి.. చేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బ తినడంతో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ఇంజన్లతో నీరు పెట్టిన రైతులకు ఎకరానికి ఐదు నుంచి పదివేల రూపాయలు అదనపు ఖర్చు అయిందని దేవినేని ఉమా వెల్లడించారు.



# మిచౌంగ్‌తో భారీ నష్టం

విజయవాడ,డిసెంబర్5(మరోఉదయం):

మిచౌంగ్ తుఫాన్ రాష్ట్రంలో బీభత్సం సృష్టిస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు భానునగర్ వద్ద తుఫాన్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుంది. భారీ ఈదురుగాలులతో ఐరన్ రాడ్స్ కుప్పకూలాయి. తీవ్రమైన గాలికి బిల్డింగ్ ప్లాస్టింగ్ సపోర్టింగ్ కోసమా కట్టిన పరంజ కూలిపోయింది. సుమారుగా ఐదంతస్తులపై నుంచి పరంజ జారి పడిపోయింది. ఐరన్ రాడ్లు ఒక్కసారిగా ఐదు అంతస్తులపై నుంచి పడిపోవడంతో సుమారుగా ఐదు ఇల్లులు ధ్వంసమయ్యాయి. ఒక ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఐరన్ రాడ్లు పడిన సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. భారీ నష్టం వాటిల్లడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యలపై కమ్యూనిస్టుల రాజీలేని పోరు

**ఎపిలో అనేక సందర్భాల్లో రోడ్డెక్కిన ఎర్రజెండాలు**

**ప్రజల సమస్యలపై దాటవేత ధోరణిలో పాలకులు**

అమరావతి,డిసెంబర్5(మరోఉదయం):

తెలంగాణతో పోలిస్తే ఎపిలో కమ్యూనిస్టులు వివిధ సమస్యలపై వీధిపోరాటాలు ఎక్కువగానే చేస్తున్నారు. ఉద్యోగుల ఆందోళనలకు మద్దతు ఇవ్వటం ద్వారా సమస్యను బాగాను హైలెట్ చేశారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అరచేతిలో వైకుంఠం చూపించారు. వాస్తవంలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైంది. ధరలు ఆకాశాన్నంటు తున్నాయి. సామాన్య ప్రజల ఆదాయాలు కుంచించుకుపోతున్నాయి. ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రతరమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించటంలో జన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యింది. అప్పులు చేయడం పంచి పెట్టడం అన్నరీతిలో పాలన సాగుతోంది. దీనిని ఎప్పటికప్పుడు కమ్యూనిస్టులు గట్టిగానే విమర్శిస్తున్నాయి. పోలవరం మొదలు, విశాఖ స్టీలు, కార్మికుల సమస్యలపై ఎపిలో కమ్యూనిస్టులు గట్టిగానే పోరాడుతున్నారు.ఇదే జగన్ ఆగ్రహానికి కారణమై ఉంటుంది. టిడిపి విమర్శిస్తే ఎదురుదాడి చేయొచ్చు. కానీ ఎర్రజెండాలు కూడా ఇలా చేయడమేంటన్న బాధ ఉండివుంటుంది.అందుకే అమరావతి, విశాఖ స్టీల్, కృష్ణపట్నం తదితర అంశాల్లో పెరుగుతున్న ప్రజా ఉద్యమాలు ఆటంకంగా మారుతున్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం, విద్యార్థుల పోరాటాలు, మహిళ, దళిత, ఆదివాసీ ఉద్యమాలు, తాజా ఉద్యోగుల ఆందోళన ఇవన్నీ అందులో భాగమే. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం ఆందోళనలను నిరంకుశంగా అణచటానికి ప్రయత్నం చేస్తున్నది. నష్టపోతున్న శ్రామికుల పక్షాన కమ్యూనిస్టులు, కార్మిక తదితర ప్రజాతంత్ర సంఘాలు నిలబడి పోరాడుతున్నాయి. ప్రజల మధ్య ఐక్యత కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. వారిని చీల్చి ప్రజా ఉద్యమాలను బలహీన పర్చటానికి పాలక వర్గాలు కుట్ర పన్నుతున్నాయి. అందుకు కులం, మతం, ప్రాంతం లాంటి ఏ ఒక్క అంశాన్ని అధికార పార్టీ వదలటం లేదు. ఎపి కూడా అదానీ, అంబానీలకు స్థావరంగా మారింది. గంగవరం పోర్టు వాటాను అదానీపరం చేయటం తాజా ఉదాహరణ. కృష్ణపట్నం ఓడరేవు ఎప్పుడో వారి పరమైపోయింది. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని, ప్రతిష్టను దెబ్బ తీయడానికి ఎర్రజెండాలపై అక్కసు వెళ్లగక్కుతున్నారని సిపిఎం ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస రావు మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి చేసిన ద్రోహం చేసినా పోరాడలేని అశక్తతలో సిఎం జగన్ ఉన్నారని మండిపడ్డారు. అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం వారికి లొంగిపోయి మతోన్మాద రాజకీయాలకు వంత పాడుతున్నాయి. బిజెపి మతోన్మాద ఎజెండాకు ప్రజా ఉద్యమాలు చెక్ పెడుతున్నాయి. నేరుగా కమ్యూనిస్టులపై విమర్శలు చేస్తే ప్రజలు సహించరు కాబట్టి అప్రతిష్టపాలైన తెలుగుదేశంతో ముడిపెట్టి కమ్యూనిస్టుల ప్రతిష్టను మసకబార్చాలనే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందన్నారు. చంద్రబాబు, జగన్ ఇద్దరూ తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని వివిఎస్ ఆరోపించారు. రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేస్తున్నా ప్రశ్నించటం లేదు. అందుకే కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే అధికార వైసిపికి కంటగింపుగా వుందన్నారు. ఆనాడు ఇదే రీతిలో కమ్యూనిస్టులపై దాడి చేసిన తెలుగుదేశం పార్టీ రీతిలోనే ఇప్పుడు

# ఎపి రాష్ట్రానికి ఒకేఒక విలన్ జగన్ : కాలవ శ్రీనివాసులు

అనంతపురం,డిసెంబర్5(మరోఉదయం):

మోసగాళ్ళు అంతా చేరి సామాజిక బస్సు యాత్ర చేస్తున్నారని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో బలహీన వర్గాలు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. బలహీన వర్గాల మాన, ధనః, ప్రాణాలకు విలువ లేదన్నారు. సినిమాలో విలన్ పాత్రని వైసీపీ మనుషులు పోషిస్తున్నారని విమర్శించారు. ఏపీ రాష్ట్రానికి మెయిన్ విలన్ జగన్ అని అన్నారు. బీసీలను 74 మందిని హతమార్చిన ప్రభుత్వం ఇది అని విరుచుకుపడ్డారు. రిజర్వేషన్‌లను తగ్గించడం, దళిత పథకాలను రద్దు చేసిన ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన ప్రభుత్వం ఇది అని.. చంపిన వాళ్ళే సానుభూతి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కుహనా మేధావులు అంత ప్రజల ముందుకు వస్తున్న మేరుగ నాగార్జున లాంటి వాళ్ళు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నలుగురు రెడ్ల చేతిలో రాష్ట్రం ప్రభుత్వం ఉందన్నారు. ఒకరికి ఉద్యోగం కానీ, కాంట్రాక్ట్ రావాలంటే ఎవరో ఒక రెడ్డి చెప్పాలన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని రెడ్లకు పాదాక్రాంతం చేసిన వీరా మాట్లాడేద అని అన్నారు. "బీసీ, ఎస్సీ, ఎస్టీ మంత్రులారా మీకు ఆత్మాభిమానం లేదా? వైసీపీ ది బస్సు యాత్ర కాదు దగాకోరుల దండయాత్ర, దండగమారి యాత్ర. ఈ వైసీపీ నయవంచలకు బుద్ధి చెప్పండి. రాయదుర్గంలో సామాజిక బస్సు యాత్ర తుస్సు మనడం ఖాయం" అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.



# ఇండియా కూటమిలో విభేదాలు..!

న్యూఢిల్లీ,డిసెంబర్5(మరోఉదయం):

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పాటైన 'ఇండియా' కూటమిలో విభేదాలు మొదలైనట్లు తెలుస్తోంది. కూటమి తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ రేపు (డిసెంబర్ 6న) సమావేశానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే అనూహ్యంగా ఆ మీటింగ్ వాయిదా పడింది. ఈ సమావేశానికి కూటమిలోని పార్టీలకు చెందిన పలువురు కీలక నేతలు డుమ్మా కొట్టే యోచనలో ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. మీటింగ్ వాయిదా పడటం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. కాగా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కూటమి తదుపరి కార్యాచరణపై చర్చిచేందుకు కాంగ్రెస్ పార్టీ సమావేశానికి పిలుపునిచ్చింది. డిసెంబర్ 6వ తేదీన ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేసింది. అయితే ఆ మీటింగ్ గురించి తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. దీదీ బాటలోనే మిగితా కూటమి నేతలు కూడా ఉన్నారు. సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, బీహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా ఇండియా కూటమి భేటీకి డుమ్మా కొట్టనున్నారు. ఆ ఇద్దరూ తమ ప్రతినిధుల్ని భేటీకి పంపనున్నట్లు తెలుస్తోంది. బుధవారం జరిగే ఇండియా బ్లాక్ భేటీకి వెళ్లే ఆలోచనలో అఖిలేశ్ లేరని ఆ పార్టీ ప్రతినిధి రాజేంద్ర చౌదరీ తెలిపారు. ఈ నేపథ్యంలోనే రేపు ఢిల్లీలో జరగాల్సిన కూటమి సమావేశం వాయిదా పడినట్లు తెలుస్తోంది.




# బియ్యంలో నాణ్యతపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల,డిసెంబర్5(మరోఉదయం):

వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో భక్తులకు వడ్డించిన అన్నప్రసాదంలో నాణ్యత లోపంపై టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు భక్తులు అన్నప్రసాదం బాగోలేదని చెప్పిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. బియ్యంలో నాణ్యత లోపంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్నప్రసాదం మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇలాంటి ఘటన జరగలేదన్నారు. అదే సమయంలో మరో 700 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని, ఆ భక్తులకులేని ఇబ్బంది మిగిలిన భక్తులకు ఎందుకు ఎదురైందో తెలియడంలేదన్నారు. ఇతర భక్తులను కొంత మంది భక్తులు రెచ్చగొట్టడం.. అక్కడ పని చేసే సిబ్బంది తాగుబోతులని ఆరోపించడం బాధాకరమని భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. కాగా తిరుమల వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో భక్తులు నిరసన తెలిపారు. భక్తులకు వడ్డించిన అన్నం బాగోలేదంటూ సిబ్బందిపై మండిపడ్డారు. ఇలాంటి అన్నం పెడతారా? అంటూ నిలదీశారు. అయితే ఈ ఒక్కసారికి క్షమించి వదిలేయమని టీటీడీ సిబ్బంది భక్తులను కోరారు. ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సిబ్బంది భక్తులకు సర్దిచెప్పి పంపిం చేశారు.

# ఏపి ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

అమరావతి,డిసెంబర్5(మరోఉదయం):

ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురైంది. ఫీజు నియంత్రణ మండలి ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు ఖరారు చేసిన ప్రక్రియను ధర్మాసనం తోసిపుచ్చింది. ఇంజనీరింగ్ కళాశాలల ఖర్చులలో భాగంగా కమిషన్ విధించిన పరిమితులు చెల్లవని హైకోర్టు స్పష్టం చేసింది. కమిషన్ కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసమే ఇలాంటి చట్ట వ్యతిరేక ప్రక్రియను చేసిందని న్యాయస్థానం పేర్కొంది. కమిషన్ చట్ట ప్రకారంగా తిరిగి ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజులు ఖరారు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాల తరపున న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, రెగ్యులేటరీ కమిషన్ తరపున సుదేశ్ ఆనంద్ వాదనలు వినిపించారు.



# శశికళ అప్పీల్‌ను తిరస్కరించిన మద్రాసు హైకోర్టు

చెన్నై,డిసెంబర్5(మరోఉదయం):



తమిళనాడు దివంగత సీఎం జయలలిత స్నేహితురాలు వీకే శశికళకు .. మద్రాసు హైకోర్టులో చుక్కెదురైంది. అన్నాడీఎంకే పార్టీకి తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా తనను కొనసాగించాలని ఆమె పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. జస్టిస్ ఆర్ సుబ్రమణియన్, ఎన్. సెంథిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ ఆ కేసులో తీర్పును ఇచ్చింది. 2022లో శశికళ దాఖలు చేసిన మూడు అప్పీల్స్‌ను బెంచ్ తిరస్కరించింది. మాజీ సీఎం జయలలిత మృతి తర్వాత 2016, డిసెంబర్ 29వ తేదీన అన్నాడీఎంకే పార్టీ జనరల్ సెక్రటరీగా శశికళను నియమించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆమెను తొలగించారు. అయితే ఆ పోస్టులో తననే ప్రకటించాలని ఆమె పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు కొట్టిపారేసింది.

# చిత్తూరు జిల్లాలో మిచౌంగ్ తుఫాను బీభత్సం

**భారీ వర్షాలతో పొంగుతున్న వాగులు**

చిత్తూరు,డిసెబర్5(మరోఉదయం):

చిత్తూరు జిల్లా తూర్పు మండలాల్లో మిచౌంగ్ తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. ఎస్ఆర్ పురం, కార్వేటినగం, గంగాధర నెల్లూరు మండలాల్లో వర్షానికి వాగులు పొంగిపొర్లుతున్నాయి. సుమారు 15 గ్రామాలకుపైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్టీఆర్ జలాశయంలో రెండు గేట్ల ద్వారా నీటిని బయటకు విడుదల చేశారు. కృష్ణాపురం జలాశయంలో ఒక గేటు ద్వారా అధికారులు నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ంగాధర నెల్లూరు మండల పరివాహక ప్రాంతమైన నీవానదిలో వరద ప్రవాహం ఉధృతి అధికంగా ఉంది.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com